www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబరు 2022

5

ఏలూరు



ఉద్యోగ, ఉపాధ్యాయులకు బొత్స క్షమాపణ చెప్పాలి

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఉద్యోగ,ఉపాధ్యాయులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. చింతలపూడి పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగ సంఘల నాయకులకు కాళ్లుపట్టుకుని అడిగే నేర్పు ఉండాలనిమాట్లాడడం దారుణమన్నారు. ఇప్పట అనేక పర్యాయాలు సమస్యలపై ప్రాధేయపడిన సందర్భాలున్నాయని, పోరాటాలు చేసి ప్రాధేయపడినప్పటికీ ఎందుకు పరిష్కరించలేదని మండిపడ్డారు. కాళ్ల పట్టుకుని రాజకీయ పదవులు సాధించడం అనేది రాజకీయ సంస్కృతి తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సంస్కృతి మాత్రం కాదని తెలిపారు. ఇది బానిసల రాజ్యమా అని ప్రశ్నించారు. బొత్సా తక్షణం వివరణ ఇచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

లారీలు పంపండి మహాప్రభో..!

బస్తాల్లో ధాన్యం నింపి అన్నదాత ఎదురుచూపులు

సంచుల కొరత తీవ్రం

35 శాతం కూడా పూర్తికాని ధాన్యం కొనుగోలు

నిడమర్రు మండలంలో పరిస్థితి దారుణం

40 కిలోల బస్తాకు రూ.24 జట్టుబిల్లు

తేమ శాతం పెరిగిందని సొమ్ము వసూలు

ధాన్యం విక్రయానికి రైతన్న అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలు రోజురోజుకు దారుణంగా మారుతోంది. సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. అవస్థలు పడి ధాన్యం బస్తాల్లో పట్టేసినా లారీలు రాకపోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ధాన్యం బస్తాలను కాపాలా కాయలేక, వర్షం వస్తే దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. దీంతో లారీలు పంపండి మహాప్రభో అంటూ అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు. ధాన్యానికి లారీలు పంపకుండా వాటిని బియ్యం ఎగుమతులకు కేటాయించడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్న చర్చ నడుస్తోంది. ధాన్యం కొనుగోలుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఏ విధంగా సమంజసమంటూ రైతులు నిలదీస్తున్నారు. నిడమర్రు మండలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని రైతులు వాపోతున్నారు. అడవికొలను, భావాయిపాలెం, బువ్వనపల్లి వంటి పలు రైతుభరోసా కేంద్రాల పరిధిలో లారీలు రాక ధాన్యం మొత్తం బస్తాల్లో పట్టి ఉంచారు. రోజుకు రెండు, మూడు లారీలను మాత్రమే పంపుతున్నారు. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితి కొంత ఇబ్బందికరంగా మారింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో 4.50 లక్షల ఎకరాల వరకూ రైతులు వరిసాగుచేశారు. ఖరీఫ్ మాసూలు దాదాపుగా ఆఖరుదశకు చేరుకుంది. ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యం 35 శాతం దాటలేదు. ఏలూరు జిల్లాలో 3.80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 87 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 3.42 లక్షల టన్నుల ధాన్యం కొనాల్సి ఉండగా ఇప్పటి వరకూ లక్షా మూడువేల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగకపోవడంతో రోడ్లు, కల్లాల్లోనే ధాన్యం దర్శనమిస్తుంది. మరోపక్క రబీకి సమయం దగ్గర పడటం, ఖరీఫ్ ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. వర్షం పడితే రాసులుగా ఉన్న ధాన్యానికి ఇబ్బంది తక్కువగా ఉంటుందని, సంచుల్లో పట్టేసిన ధాన్యానికి ఇబ్బంది వస్తుందని రైతులు లబోదిబోమంటున్నారు. సంచులు సైతం అందక రైతులు సొసైటీల వద్ద క్యూ కడుతున్నారు. శనివారం సంచుల కోసం పోతునూరు గ్రామంలో రైతులు ఆందోళన చేపట్టిన తర్వాత అందించిన పరిస్థితి ఉంది. రైతులు రోడ్డెక్కితే తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదు.



అన్నీ సమస్యలే

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం సమస్యగా మారింది. సంచులు సక్రమంగా అందకపోవడం పెద్ద సమస్యగా ఉంటే, ధాన్యం సంచుల్లో పట్టినా లారీలు లేక రైతులు నలిగిపోతున్నారు. గతంలో 40 కిలోల బస్తాకు జట్టు బిల్లు రూ.పది ఖర్చుకాగా ఇప్పుడు అదే బస్తాకు నేరుగా లారీలో వేస్తే రూ.18, తొలుత ట్రాక్టర్‌పై వేసి మళ్లీ లారీలో లోడ్ చేస్తే బస్తాకు రూ.24 అవుతుంది. ధాన్యం కాటా వేసిన చోట రూ.వంద వసూలు చేస్తున్నారు. జట్టు మామూలు కింద రూ.200 వరకూ తీసుకుంటున్నారు. డ్రైవర్ మామూలు రూ.600 ఇవ్వాల్సి వస్తుంది. నిడమర్రు మండలానికి చెందిన రైతులకు సంబంధించిన ధాన్యం గణపవరం వేబ్రిడ్జి వద్ద కాటా వేస్తున్నారు. అక్కడ అంతా సవ్యంగా వచ్చినప్పటికీ మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత కాటా తగ్గిందంటూ కోతలు వేస్తున్నారు. ఇక్కడ తేమశాతం చూసిన తర్వాత అంతా సవ్యంగా ఉంటనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అయినప్పటికీ మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత తేమశాతం తగ్గిందంటూ అందుకు సంబంధించిన మినహాయింపు డబ్బులను రైతులతో ఫోన్ పే చేయించుకుంటున్నారు. జట్టు బిల్లు, కిరాయి సొమ్ములు ఎప్పటికప్పుడు తెలియడం లేదు. ఒకవేళ ఇచ్చినా అవి ఇ-క్రాప్ జరిగిన భూయజమాని ఖాతాలో పడతాయని, ఆ సొమ్మును కౌలురైతులకు ఇచ్చే అవకాశం ఉండదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నూతన ధాన్యం కొనుగోలు విధానంతో తీవ్ర సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు.

అధికారులపై తీవ్ర ఒత్తిడి

ప్రభుత్వం తెచ్చిన నూతన కొనుగోలు విధానంతో కిందిస్థాయి, ఉన్నతస్థాయి అధికారులు సైతం నలిగిపోతున్నారు. పౌరసరఫరాలశాఖ, వ్యవసాయశాఖ, మిగిలిన అన్ని శాఖల అధికారులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో రైతులు మెప్పించలేని పరిస్థితి నెలకొంది. రైతుల బాధలు తెలిసినా ఏమీ చేయలేకపోతున్నామని కిందిస్థాయి అధికారులు పలుచోట్ల వాపోతున్నారు. లారీల సమస్యపై పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ మంజుభార్గవిని వివరణ కోరగా సమస్యను పరిష్కరించామని, లారీల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జగనన్న పాల వెల్లువతో కల్తీకి అడ్డుకట్ట

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశకిత - లింగపాలెం

కల్తీ లేని స్వచ్ఛమైన పాలు ప్రజలకు అందించడమే జగనన్న పాల వెల్లువ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా పాల సేకరణ ప్రారంభంపై అధికారులతో, పాడి రైతులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పిల్లలు తాగే పాలను సైతం కల్తీ చేయడం అమానుషమని, లింగపాలెం మండలంలో ఇటీవల కల్తీ పాల వ్యవహారం బయటపడిందని, అలాంటి ఘటనలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పాలను కల్తీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, జిల్లాలో మరెక్కడా కల్తీ పాలు జరగకుండా గట్టి నిఘా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం పాడి రైతులకు మేలుచేస్తుందని, పాలు అందించే పాడి రైతులకు మెరుగైన ధర అందించి, ప్రయివేటు పాల డైరీల దోపిడీ నుండి పాడి రైతులను కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అమూల్ సంస్థ ద్వారా పాల సేకరణలో వెన్న శాతం, పరిమాణాల కొలత ఖచ్చితత్వంతో ఉంటుందన్నారు. పాలు అందించిన పది రోజుల్లో సంబంధిత పాడి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తారన్నారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 14 వేల లీటర్లకు పైగా పాల సేకరణ జరుగుతుందని, దీనిని 20 వేల లీటర్లకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని తిమ్మక్కపాలెం, మల్లేశ్వరం, లింగపాలెం-2, కల్యాణంపాడు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాల ఏర్పాటుపై నెలకొన్న సమస్యలను కలెక్టర్ అధికారులు, ప్రజాప్రనిధులు, మహిళా పాడిరైతులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. పాలను అందించే మహిళా పాడి రైతులతో పాడి రైతు సంఘంను ఏర్పాటు చేసి, పాల సేకరణ లాభాలను వారే పొందొచ్చన్నారు. పాల సేకరణ పెరిగే కొద్దీ సంఘాలకు లాభాలు పెరుగుతాయన్నారు. జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ అమూల్ సంస్థ ప్రయివేటు సంస్థ కాదని, పాడి రైతులందరూ సభ్యులుగా కలిగిన సహకార విధానం ద్వారా ఏర్పాటైన వ్యవస్థ అని అన్నారు. జగనన్న పాల వెల్లువలో పాలల్లో వెన్న శాతం బట్టి 11 శాతం వెన్న కలిగిన పాలకు రూ.82కు పైగా ధర లభిస్తుంటే, ప్రయివేటు డైరీల వారు కేవలం అత్యధికంగా రూ.72 మాత్రమే అందిస్తున్నారన్నారు. అమూల్ సంస్థ వారు పాడిరైతులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తున్నారని, పెట్టుబడి రుణాలు, ఆరు నెలల పాటు నిరంతరాయంగా సేకరణ కేంద్రాలకు పాలు అందిస్తే పశువుల కొనుగోలుకు రుణాలు అందించడంతోపాటు, వారి పశువులకు అవసరమైన నాణ్యమైన దాణా అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 20 రూట్లలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా పాల సేకరణ జరుగుతుందన్నారు. లింగపాలెం మండలంలో ఈ నెల ఆరో తేదీ నుండి పాల సేకరణ ప్రారంభవుతుందన్నారు. జిల్లా సహకార అధికారి ప్రవీణ మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో 374 మంది పాడిరైతులతో ప్రారంభమై ప్రస్తుతం 10,348 మంది రైతుల నుండి పాల సేకరణ స్థాయికి చేరుకుందన్నారు. ప్రస్తుతం రోజుకు 14 వేల లీటర్లకు పైగా పాలను సేకరిస్తున్నామని, జిల్లాలో ఇంతవరకు 47 లక్షల లీటర్ల పైగా పాలను సేకరించామని, నవంబర్‌లో నాలుగు లక్షల లీటర్ల వరకు పాలను సేకరించామని తెలిపారు. పాడి రైతులకు 20 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్ర, జెడ్‌పిటిసి సభ్యులు హరినాథరాజు, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ ఆశీర్వాదం, ముసునూరు వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, జగనన్న పాల వెల్లువ పథకం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఓటుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని ఆర్‌డిఒ జాన్సీరాణి అన్నారు. మండలంలోని ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం దర్భగూడెం, జీలుగుమిల్లి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసధాన విధానం గురించి, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటరు కార్డుకు ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఓటరు కార్డులో మార్పులు చేర్పులకు సంబంధించి ఏమైనా లోపాలుంటే సరిచేసుకోవచ్చన్నారు. ఆమెతో పాటు తహశీల్దార్ జి.ఎలీషా, విఆర్‌ఒ బాష, బూత్ లెవిల్ అధికారులు, సచివాలయ సెక్రెటరీలు లక్ష్మి ప్రసన్న, కావేరి ఉన్నారు.



ఘనంగా హేలాపురి కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలనే కోరిక ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులు అత్యంత ప్రతిభా పాటవాలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని సెట్‌వెల్ సిఇఒ మెహ్రాజ్ అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, తద్వారా మంచి అలవాట్లతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. దెందులూరు మండల పరిధిలోని వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెహ్రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా అధ్యాపకుల అడుగుజాడల్లో విద్యనభ్యసించినప్పుడే పూర్తిస్థాయిలో రాణించగలుగుతారన్నారు. జిల్లా టూరిజం శాఖా మేనేజర్ పట్టాభి రామయ్య, జిల్లా క్రీడా శాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ చదువు పూర్తి చేసుకున్న తర్వాత ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నతస్థాయిల్లో ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలని, అప్పుడే కన్నవారి కలలకు పూర్తి న్యాయం చేయగలుగుతారన్నారు. ముందుగా కళాశాల విద్యార్థుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి ఫ్రెషర్స్ డే వేడుకలను ప్రారంభించారు. ప్రముఖ సైకాలజిస్ట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఏ విధంగా ఉండాలో అధ్యాపకులతో, ఏవిధంగా నడుచుకోవాలో, ఉద్యోగాల్లో స్థిరపడిన తర్వాత ఏ విధంగా ప్రవర్తించాలో, ఆరోగ్యంగా ఎలా ఉండాలో అనే అంశాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో వివరించారు. అనంతరం సెట్‌వెల్ అధికారులు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ అండ్ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం బ్రోచర్‌ను విడుదల చేశారు. పలు క్రీడల్లో విజయంసాధించిన క్రీడాకారులకు బహుమతులు, క్రీడాకారులకు జిల్లా క్రీడా శాఖ తరపున క్రికెట్ కిట్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కతి కార్యక్రమాలను విద్యార్థులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెట్‌వెల్ ఎఒ జాన్ కెనడి, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ, కళాశాల ఎఒ టి.కరుణానిధి, సీనియర్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్‌ఒడి శివరాజ్, సివిల్ హెచ్‌ఒడి తేజ, ఇసి హెచ్‌ఒడి జెస్సీ కిరణ్, డైరెక్టర్ అడ్మిషన్స్ పి.చిన్ని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన జగనన్న ఇళ్లు

ఏలూరు నగర కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. స్థానిక శనివారపుపేటలోని జగనన్న ఇళ్ల కాలనీ నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి శనివారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేసి పనులు చేపట్టామన్నారు. జగనన్న ఇళ్ల కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు నగరంలోని 50 డివిజన్లలో పేదలందరికీ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సొంతంగా ఇంటి నిర్మాణాలు చేపట్టే వారికి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంట్, ఐరన్, బ్రిక్స్, ఇసుక అందుబాటులో ఉంచుకుని ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. శనివారపుపేట జగనన్న ఇళ్ల కాలనీలో మొత్తం 540 ఇళ్లకు గాను 108 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు వివిధ స్థాయిల్లో ఉన్నాయని తెలిపారు. అధికారులు ప్రతిరోజూ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. దీనిపై సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ షాహిద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖర్, హౌసింగ్ ఇఇ శ్యామలారావు, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జోరు.. బేజారు..!

చంద్రబాబు పర్యటనతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం

చింతలపూడి, పోలవరంల్లో గ్రూపు తగాదాలపై వీడని ఆందోళన

నూతన విధానం పేరిట వరి రైతులతో ప్రభుత్వ చెలగాటం



టిడిపి అధినేత చంద్రబాబు పర్యటన జిల్లాలోని ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహన్ని నింపింది. దెందులూరు, చింతలపూడి, పోలవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల మీదుగా సాగిన పర్యటనలో ఆయా ప్రాంతాల్లో ప్రధాన సమస్యలు ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతూ చంద్రబాబు ప్రసంగాలు సాగడం ఆయా ప్రాంత టిడిపి కార్యకర్తలను, నేతలను ఉత్తేజపరిచింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టు, ధాన్యం రైతుల సమస్యలు తన ప్రసంగంలో ప్రస్తావించారు. అదే సమయంలో చింతలపూడి, దెందులూరు ఎంఎల్‌ఎలపై నేరుగా విమర్శనాస్త్రాలను సంధించారు. అయితే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై విమర్శలు గుప్పించిన చంద్రబాబు తన ప్రభుత్వం హయాంలో చింతలపూడి, పోలవరం నిర్వాసితుల ఊసే మరిచిన విషయాన్ని రాజకీయ పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. గతమెలాగున్నా రానున్నకాలంలో అధికారంలోకొస్తే నిర్వాసితులను ఎలా ఆదుకుంటారనేది స్పష్టంగా చెప్పకపోవడంపై బాధిత ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు అంశంగా 70 శాతానికిపైగా పనులు తామే పూర్తి చేశామని చెబుతున్న చంద్రబాబు నిర్వాసితులకు పునరావాసం, పరిహారంపై పెద్దగా నోరు మెదపకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. తన చేతుల మీదుగానే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తానని పదేపదే చెబుతున్న చంద్రబాబు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, పరిహారం అందిస్తామని ఎక్కడా స్పష్టం చేయకపోవడం చర్చనీయాంశమైంది. అంటే గతంలో వలె ప్రాజెక్టు పూర్తిపైనే దృష్టి సారించడం తప్ప నిర్వాసితులను గతంలో వలె, ఈ ప్రభుత్వం తరహాలో గాలికొదిలేస్తారని అర్థమవుతోందని నిర్వాసితుల నేతలు చెబుతున్నారు. ఇక చింతలపూడి భూనిర్వాసితులు పట్టిసీమ తరహా పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. దానిపై నాడు.. నేడు కూడా ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదే సమయంలో దెందులూరు నియోజకవర్గం మినహా మిగిలిన చోట్ల ఆ ప్రాంత నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడమూ చర్చనీయాంశమైంది. పెదవేగి మండలం విజయరాయిలో దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు అవకాశం ఇచ్చారు. అయితే చింతలపూడిలో మాజీ మంత్రి పీతల సుజాతకుగాని, పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెంలో మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్, గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన బొరగం శ్రీనుకుగాని మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఈ రెండుచోట్ల మాజీ ఎంపీ మాగంటి బాబుకే మాట్లాడే అవకాశం ఇచ్చారు. ప్రధానంగా ఈ రెండు నియోజకవర్గాల్లో పార్టీలోని గ్రూపుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు వల్లే స్థానిక నేతలకు అవకాశం కల్పించలేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. చింతలపూడి నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లకు సంబంధించిన సమావేశాలను సైతం సుజాత గ్రూపు నేతలు, మాగంటి బాబు గ్రూపు నేతలు వేర్వేరుగా నిర్వహించడం గమనార్హం. ఇక పోలవరం నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి ఉంది. తాత్కాలికంగా ఇరు గ్రూపులకు అవకాశం కల్పించకుండా చంద్రబాబు పర్యటన సాగించినా రానున్న రోజుల్లో ఆ గ్రూపు విభేధాలు సమసిపోయేలా చర్యలు తీసుకోకపోతే పార్టీకి నష్టమేనని ఆ పార్టీ శ్రేణులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇక చంద్రబాబు ఏలూరు జిల్లా పర్యటన అంతా చింతమనేని ప్రభాకర్ తానై నడిపించారు. గతంలోనూ గోదావరి వరదల సందర్భంగా విలీన మండలాల్లో పార్టీ తరఫున సాయమందించే కార్యక్రమాల్లో ఆ నియోజకవర్గ నేతలతో సంబంధం లేకుండానే నేరుగా పాల్గొన్నారు. మొత్తంగా పరిణామాలన్నీ చూస్తే రానున్న ఎన్నికల్లో చింతమనేని ఏలూరు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలు కన్పిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

సమస్యల సుడిలో ధాన్యం రైతు

వరిసాగు ఆరంభం నుంచి పంట చేతికొచ్చే వరకూ ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు అల్లాడేవారు. పంట చేతికొచ్చాక ధర సమస్య తప్ప అమ్మకం, సొమ్ము చేతికందడం వంటి సమస్యలు పెద్దగా ఉండేవి కావు. ప్రభుత్వాల విధానాల ఫలితంగా సాగు ఆరంభం నుంచి ధాన్యం విక్రయించి సొమ్ము చేతికొచ్చే వరకూ అడుగడుగునా రైతులను సమస్యలు వెంటాడుతున్నాయి. ఫలితంగా తాము వరి సాగు చేస్తున్నామా.. సమస్యల సాగు చేస్తున్నామా అనే మీమాంసలో రైతులు కొట్టుమిట్టాడే దుస్థితి దాపురించింది. ప్రధానంగా చేతికొచ్చిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. గోనె సంచుల కొరత, తేమ శాతం నిబంధనలు ఇప్పటికే రైతులను వేధిస్తుండగా తాజాగా లారీల సమస్య తీవ్ర రూపం దాల్చడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. సొమ్ము మాటెలాగున్నా ధాన్యం మిల్లుకు ఎప్పుడు చేరుతుందా అని రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా పాలకులు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఇప్పటికే వరిసాగుకు దూరమవుతున్న రైతులు ప్రస్తుత పరిస్థితులతో మరింత బేజారెత్తి సాగుకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

-విఎస్‌ఎస్‌వి.ప్రసాద్

ఆ భూములు పేదలకు ఇవ్వొచ్చుగా..!

భూస్వాముల కబంధ హస్తాల్లో ఎర్రకాల్వ మిగులు భూములు

ఏజెన్సీలో ఎల్‌టిఆర్, పోడు భూముల పరిస్థితీ అంతే


పేదలు రోడ్డెక్కినా పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరంతర పోరు

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

మాకు సెంటు భూమి లేదు.. ప్రభుత్వ భూమి లేదా మిగులు భూమి ఇస్తే సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం అని పేదలు ఏ ప్రజాప్రతినిధినైనా, అధికారినైనా కోరితే భూములు ఎక్కడున్నాయనే ప్రశ్న రక్కున అర్జీదారులపై సంధిస్తారు. అయితే బడాబాబులు, భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్న భూముల జోలికి మాత్రం వెళ్లరు. ఒకవేళ ఎక్కడైనా ప్రభుత్వ భూమి నిరుపయోగంగా ఉంటే అక్కడ సాగు చేసుకునేందుకు పేదలు ఉపక్రమిస్తే ఆగమేఘాల మీద అధికారులు పోలీసులను వెంటబెట్టుకుని వాలిపోతారు. పేదలు అనే కనికరం లేకుండా విరుచుకుపడి వారిని అక్కడి నుంచి తరిమికొడతారు. ఇదేమిటని ప్రశ్నిస్తే లాఠీదెబ్బలు, అరెస్టులు, కేసులు షరామామూలే. ఇదీ జిల్లాలో భూమిలేని సగటు పేదవాని దుస్థితి

అయితే ప్రభుత్వ, మిగులు భూములు ఎక్కడున్నాయో గుర్తించి వాటిని పేదలకు పంచాలని జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం నిర్విరామ పోరు సాగిస్తోంది. దీనిలో భాగంగా జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం ప్రాంతాల్లోని ఎర్రకాల్వ మిగులు భూములను పేదలకు పంచాలని అప్రతిహతంగా సంఘం ఆధ్వర్యాన ఆయా ప్రాంతాల పేదలు పోరాడుతున్నారు. ఏజెన్సీలో ఎల్‌టిఆర్, పోడు భూములను గిరిజనులకు పంచాలని అక్కడి గిరిజన సంఘంతో కలిసి పేద యువత, మహిళలను సమీకరించి పోరుబాటలో ముందుకు సాగుతున్నారు. ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములు పేదలకు సాగుకివ్వాలని, జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, సాగులో ఉన్న భూములు, గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని, ఏజెన్సీలో ఎల్‌టిఆర్ భూములు గిరిజనులకు పంచాలని, పోడు, అటవీ బంజరు భూములకు పట్టాలివ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో 1980లో నిర్మించిన ఎర్రకాల్వ రిజర్వాయర్ కోసం ఏడు వేల ఎకరాలు సేకరించారు. నాటి నుండి సుమారు 2500 ఎకరాలు ముంపులో లేకుండా మిగులు భూములుగా ఉన్నాయి. దీంతో ఆ భూములను అమ్మిన భూస్వాములు, సంపన్నులే నాటి నుండి అక్రమంగా, చట్టవిరుద్ధంగా వాటిని అనుభవిస్తున్నారు. భూములకు పరిహారం పొంది, వాటితో మరోచోట భూములు కొని అనుభవిస్తున్నారు. ఈ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా పామాయిల్, జామాయిల్, కొబ్బరి, చెరకు, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తున్నారు. దీనివల్ల గట్టు బలహీనపడుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పైగా వీరికి విద్యుత్ శాఖ బోరు కనెక్షన్లు సైతం ఇచ్చింది. 40 ఏళ్ల కాలంలో ప్రభుత్వాలు, నేతలు మారినా యథేచ్ఛగా పైసా శిస్తు చెల్లించకుండా ఆ భూములను పెద్దలు అనుభవిస్తూనే ఉన్నారు. ఈ భూములన్నీ పేదలకు సాగుకు ఇవ్వాలని భూముల్లోకి ప్రవేశించినప్పుడు మాత్రమే ప్రభుత్వాలకు, అధికారులకు చట్టాలు, నిబంధనలు గుర్తొస్తాయి. గత నాలుగు సంవత్సరాల నుంచి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సాగిస్తున్న పోరాటం పేదల్లో ఆశలు చిగురింపజేసింది. కులం, మతం, ప్రాంతం, పార్టీ విభేదాలన్నింటినీ పక్కనబెట్టి పేదలంతా ఒక్కటయ్యారు. పట్టుదలగా పోరాటం సాగిస్తున్నారు. వందలాది ఎకరాల్లో వరి సాగు వేసి ధాన్యం పంచుకుంటున్నారు. పామాయిల్, కొబ్బరి తోటల్లో ఫలసాయం పొందుతున్నారు. దీన్ని సహించలేని భూస్వాములు, సంపన్నులు నాటి, ప్రస్తుత అధికార పార్టీల నేతలు కుమ్మక్కై అధికారుల సహకారంతో నిర్బంధానికి పాల్పడుతున్నారు. పదికి పైగా కేసులు మోపారు. పేదలపై తుపాకులు ఎక్కుపెట్టి బెదిరించారు. గూండాలతో దాడులకు పూనుకున్నారు. పేదలకు అండగా నిల్చిన టి.నర్సాపురం మండల నాయకుడు తుమ్మల సత్యనారాయణను కిడ్నాప్ చేసి, చంపేస్తామని బెదిరించడం భూస్వాముల ఆగడాలకు పరాకాష్టగా చెప్పొచ్చు. వీటన్నింటినీ తిప్పికొట్టి పేదలు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఇరిగేషన్ రాష్ట్ర స్థాయి అధికారులపై ఒత్తిడి చేసి భూస్వాములే భూములు సాగు చేసుకునేలా, శిస్తు కట్టించుకునేలా అనుమతులు తీసుకురావడం గమనార్హం. అయినప్పటికీ పేదలు పట్టు వీడకుండా పోరాడుతున్నారు. మరోపక్క కోర్టుల్లోనూ న్యాయపోరాటం సాగిస్తున్నారు.



జిల్లాలో అన్ని భూముల సంగతీ అంతే

జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో 80 ఎకరాల సీలింగ్ భూములు, టి.నర్సాపురం మండలం రామన్నగూడేనికి చెందిన 40 ఎకరాలు, కృష్ణాపురం మెట్టపై అల్లూరి సీతారామరాజునగర్‌లో గుడిసెలు వేసుకున్న 80 ఎకరాల దేవుని మాన్యం భూముల విషయంలో జరుగుతున్నది ఇదే. అల్లంచర్లరాజుగూడెంలో 300 ఎకరాల అసైన్డ్ భూముల విషయమై ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్థానిక పెత్తందారులు కొత్త వివాదాలు తీసుకొస్తున్నారు. లింగపాలెం మండలం భోగోలులో 1400 ఎకరాలు అసైన్డ్ భూములు దశాబ్దాలు గడిచినా పేదలకు దక్కడం లేదు. చింతలపూడి పాత తాలుకాలో 30 వేల ఎకరాల అసైన్డ్ భూములు సంపన్నుల ఆక్రమణలోనే ఉన్నాయి. జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు 5.75 లక్షల ఎకరాల్లో నాలుగు లక్షల ఎకరాలకుపైగా సంపన్నుల గుప్పెట్లో ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలంలో జిల్లా పరిషత్ భూములు, దెందులూరు మండలం కొవ్వలి, దోసపాడు, పోతునూరు గ్రామాల్లో అసైన్డ్ భూములు వందల ఎకరాలు భూమాఫియా చేతుల్లో ఉన్నాయి. ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక ఒకే ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది.

భూములు పంచాలని పోరు ఉధృతం

ఎం.జీవరత్నం,

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు



భూముల సమస్యపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం భూశంఖారావం పేరిట చేపట్టిన పాదయాత్ర పేదల్లో ఉత్సాహన్ని, స్ఫూర్తిని నింపింది. అధికారులు సైతం ఒకింత అప్రమత్తమయ్యారు. అయితే అధికార పార్టీ పెద్దలు, పెత్తందారుల ఒత్తిడిలో వారు కూడా బడాబాబుల పక్షానే నిలుస్తుండటం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ, మిగులు భూములను పేదలకు పంచితే కొన్ని వేల కుటుంబాల జీవనం మెరుగుపడుతుంది. పేదలకు భూములు పంచాలని పోరు రానున్న కాలంలో మరింత ఉధృతం చేస్తాం.

7న వ్యాసరచన, చిత్రలేఖనం,పాటల పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈనెల ఏడో తేదీన ఎస్ఎఫ్ఐ, బోడెపూడి సుందరయ్య స్మారక ట్రస్ట్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తున్నామని విజ్ఞాన కేంద్రం ప్రతినిధి గుడిపాటి నరసింహారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడో తేదీ ఉదయం పది గంటల నుండి స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో హై స్కూల్, కళాశాల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ విడుదల చేసిన వారిలో బోడేపూడి సుందరయ్య స్మారక ట్రస్టు ఛైర్మన్ పి.సూర్యారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు బి.యశ్వంత్, మణి, డి.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

రమేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

చింతలపూడి:మండలంలోని ప్రగడవరానికి చెందిన మహాలక్ష్మణుడుపై దాడి చేసిన వైసిపి నేత రమేష్ రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దాడిలో గాయపడిన మహాలక్ష్మణుడు చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతనికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. దళిత ఎంఎల్ఎ నియోజకవర్గంలో దళితులపై దాడి జరగడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. లక్ష్మణుడుపై దాడి చేసిన రమేష్ రెడ్డిపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గాలు అరికట్టాలని, లేకపోతే దళితులను ఐక్యం చేసి ఉద్యమం చేస్తామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహాలక్ష్మణుడును ఎంఎల్ఎ పరామర్శించాలని, అతనిపై దాడి చేసి వైసిపి నేతలను పార్టీ నుంచి బహిష్కరించాలని, బాధితునికి న్యాయం చేయాలని పేర్కొన్నారు.

మంచినీటి చెరువులను నింపుకోండి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు వారి వారి గ్రామాల్లోని మంచినీటి చెరువులను త్వరగా నింపుకోవాలని సిబి కెనాల్ వడాలి సెక్షన్ ఎఇఇ బి.సిద్ధార్థ కోరారు. ఈ నెల ఐదో తేదీ వరకు మాత్రమే మండలంలోని సిబి కెనాల్‌కు పోల్‌రాజ్ కెనాల్‌కు మంచినీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. దాళ్వా రద్దు కారణంగా రెండు కాల్వలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. సర్పంచులు వారి వారి గ్రామాల్లోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆయన కోరారు.

రామాలయం పున:నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు హరిజనవాడలో నూతనంగా నిర్మించనున్న కోదండ రామాలయం పున:నిర్మాణ పనులకు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవాణి తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆర్థిక సాయంతో సమరసతసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన కోదండ రామాలయం పున:నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రామస్తులందరూ ఆలయ కమిటీకి తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గంటా సంధ్య, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం 522 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కొత్త ఓటర్లు నమోదు, చిరునామా మార్పులు, చేర్పులు, ఓటు బదిలీల దరఖాస్తులు స్వీకరణ కోసం అధికారులు శనివారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించగా కొత్త ఓటర్ల కోసం యువత ఉత్సాహం చూపించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 213 పోలింగు కేంద్రాలున్నాయి. ఉంగుటూరు మండలంలో 66, భీమడోలులో 53, నిడమర్రులో 38, గణపవరంలో 56 పోలింగు కేంద్రాల్లో బిఎల్ఒలు 522 క్లయిమ్‌లను స్వీకరించారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు వారు 188 మంది, 19 ఏళ్ల పైబడిన వారు 216 మంది, ఫార్మ్-7కి 85, ఫార్మ్- 8కి 33 మొత్తం 522 దరఖాస్తులు స్వీకరించినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఉంగుటూరు తహశీల్దార్ ఎవి.రమణరావు తెలిపారు.

ఏడు నక్షత్రాల బేకరీ ప్రారంభం

కలిదిండి : స్థానిక ప్రధాన సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు నక్షత్రాల (సెవెన్ స్టార్) బేకరీని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. బేకరీ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. సర్పంచులు ఎం.మారుతీ ప్రసన్న, బత్తిన ఉమామహేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, నాయకులు బోడిగడ్డ కిషోర్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రతీపౌరుడు స్వేచ్ఛగా జీవించాలని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. 73వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా మండలానికి ఆయన శనివారం విచ్చేశారు.తొలుత స్థానిక కుక్కునూరు మండల కేంద్రంలో ర్యాలీగా బయలుదేరి కివ్వాక గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి రావు మీనా వినోద్, ఎస్ఎస్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సురేంద్రబాబు పాల్గొన్నారు.

మద్ది ఆలయానికి 1.26 కిలోల వెండి అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి దాతలు 1.26 కిలోల వెండి వస్తువులు అందజేశారని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. శనివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కొడవటి వారి లంక గ్రామానికి చెందిన కె.వీరభాను నాగేశ్వర చౌదరి వెండి వస్తువులు అందచేశారని తెలిపారు. ప్రకాశం జిల్లా రెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన దుగ్గిరెడ్డి నరేంద్ర రెడ్డి శిరీష దంపతులు ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,100 విరాళం అందించారని తెలిపారు.

త్వరితగిన తహశీల్దార్ కార్యాలయ భవనం పూర్తి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

గత ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టి మధ్యలో ఆగిపోయిన తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని త్వరిగతిన పూర్తిచేస్తామని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఈ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, సర్పంచి నవరత్నకుమారి, పార్టీ మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దండే పుష్పలత, ఎంపిటిసి మంగినేని రామకష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపాలిటీ భవిష్యత్ ప్రయోజనాల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా అన్నారు. శనివారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయ కౌన్సిల్ హాలులో స్టేట్ హోల్డర్ మాస్టర్ ప్లాన్‌పై ఐటిపిఎ బృంద సభ్యులు, ప్రభుత్వశాఖ అధికారులతో అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ పట్టణ అభివృద్ధి కోసం తయారు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే ప్రభుత్వశాఖ అదికారులు, ప్రతినిధులు, కౌన్సిలర్లు మాస్టర్ ప్లాన్ తయారీకి తగిన సూచనలు, సలహాలు చేయాలని సూచించారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి తెలంగాణ మద్యం పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రంలోని కామయ్యపాలేనికి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఐదు మద్యం సీసాలను పట్టుకున్నారు. మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ఎస్.సోమ శేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

వికలాంగుల్లో ప్రతిభను వెలికి తీయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని స్థానిక అశోక్‌నగర్‌లోని భవిత కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కేంద్రంలోని వికలాంగులైన చిన్నారులు వివిధ వేషధారణాలతో అందరినీ అబ్బురపరిచారు. ముఖ్యంగా చిన్నారులు పలు సినీ పాటలకు నృత్యాలు వేయడం, పాటలు పాడడం అక్కడివారిని ఆకట్టుకుంది. అనంతరం కొందరు చిన్నారులకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. వారికి ఉచితంగా ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ఉపాధ్యాయురాలు ఎస్.శ్యామల, వెంకటదుర్గ, విజయలక్ష్మి పాల్గొన్నారు. నిస్వార్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆహారాన్ని అందించారు.

దెందులూరు:వికలాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సిహెచ్.బుధవ్యాస్ సూచించారు. దెందులూరు గారపాటి హైమవతి దేవి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రధానోపాధ్యా యులు పివి.శర్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. వికలాంగులకు మూడు వీల్ చైర్స్, ఒక సీపీ చైర్, ఒక రొలెటర్, రెండు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయలు సుధీర్‌కుమార్, శ్రీదేవి, రామలక్ష్మి, పాఠశాల గ్రంథ పాలకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమడోలు :వికలాంగుల పట్ల తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు మెలగాల్సిన తీరు, వారికి అండగా నిలవాల్సిన విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని భీమడోలు మండలంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలులోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం(భవిత)లో ఐఇఆర్‌టి జి.రత్నకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయురాలు అక్బరున్నీసా వలీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిడిఒ రాఘవన్, భీమడోలు హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పావతి పాల్గొన్నారు. భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు (ట్రైనర్) రత్నకుమారి మాట్లాడారు. సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయులు మండే సుధాకర్ దంపతులు విద్యార్థులకు రూ.5500 విలువైన స్టీల్ క్యారియర్లు, భీమడోలుకు చెందిన జానకి సిల్క్స్ స్టీలు ప్యాస్కులను అందించారు. వీరితో పాటు భీమడోలు ఎంపిపి, కె.రామయ్య వికలాంగ విద్యార్థులకు, వారి సహాయకులకు భోజనం ఏర్పాటు చేశారు.

కొయ్యలగూడెం : స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని వికలాంగ పిల్లలకు శనివారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఫారెస్ట్ రేంజర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. టి.సరస్వతిదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ జె.సురేష్‌బాబు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలత్రిపురిశ్వరి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు రాజేష్ పాల్గొన్నారు. కొయ్యలగూడెంలోని వికలాంగుల హాస్టల్, స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి ముప్పిడి విజయ్‌కుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వికలాం గులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించి బహుమతులు అందించారు. అనంతరం సర్పంచి సొంత ఖర్చులతో వికలాంగులకు వారి తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అంకలగూడెం చైల్డ్ గైడెన్ సెంటర్‌లో రోటరీ క్లబ్ 3020 అధ్యక్షులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సంకుకొండ ఆధ్వర్యంలో వికలాంగులకు డ్రాయింగ్ బుక్స్, కలర్ బుక్స్, వివిధ సామగ్రి, పౌష్టికాహారం అందించారు.

టి.నరసాపురం : స్థానిక భవిత కేంద్రంలో మండల ప్రత్యేక ఉపాధ్యాయులు జె.శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివి.ప్రభావతి దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ముదినేపల్లి:వికలాంగులకు రూ.ఆరు వేలు పింఛను ఇచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్ మాదిగ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కో కన్వీనర్ కాశీ కృష్ణ మాదిగలు డిమాండ్ చేశారు. శనివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పింఛను రూ.6 వేలు పెరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు వినతిపత్రం అందించారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించనున్నారు. గుండుగొలను లే అవుట్‌లో 500 గృహ ప్రవేశాలు జరిగితే కాలనీ అభివృద్ధికి మూడు భారీ బిటి రోడ్లు మంజూరు చేస్తానన్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ హామీపై స్థానిక గ్రామ ఉపసర్పంచి ముందుండి సూర్యనారాయణ రాజు, మండల ప్రత్యేక బృందం స్పందించారు. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన లక్ష్యాన్ని చేరేందుకు కార్యాచరణ పనులకు రూపొందించుకొని అమలు చేస్తున్నారు. గుండుగొలను లే అవుట్‌లో 771 స్థలాల పంపిణీ స్థల సేకరణ పంపిణీ కార్యక్రమం సర్పంచి గ్రామ ఉపసర్పంచి సహాయ సహకారాలతో పూర్తయ్యాయి. ఇప్పటివరకు 132 గృహ ప్రవేశాలు జరిగాయి. 450 మంది నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉంది. సుమారుగా 370 వరకు నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసేందుకు స్థానిక యంత్రాంగం నీటి వసతి కల్పించారు. విద్యుత్, రోడ్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా శనివారం కాలనీలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవిఆర్.గంగాధరరావు హాజరయ్యారు. ఈ సదస్సుకు లబ్ధిదారులతో పాటు అధికారులు అతి తక్కువ సంఖ్యలో హాజరు కావడంతో మండల బృందం గురువారం మరోసారి సమావేశాన్ని నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికంగా, మండల, జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాఘవన్, ఐకెపి ఎపిఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :మండల వ్యాప్తంగా మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు అధికారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం పి.రాజవరం సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో తహశీల్దార్ ఎలీషాతో కలిసి పివిఎస్.నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివిఎస్.నాయుడు మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని చెప్పారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

పాలాచర్ల రాజవరంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను తహశీల్దార్ ఎలీషాతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రామారావు, ఎపిఒ జాన్‌వెస్లి, హౌసింగ్ ఎఇ ప్రసాద్, పంచా యతీ సచివాలయ కార్యదర్శులు అశోక్, రవీంద్ర పాల్గొన్నారు.

ఉంగుటూరు : జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌డిఒ జివి.రమణ సూచించారు. చేబ్రోలు సచివాలయం వద్ద లబ్ధిదారులతో అధికారులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునే వారికి సత్వరమే బిల్లులు ఇస్తున్నామని, వెంటనే పనులు ప్రారంభించుకోవాలని కోరారు. 30 మంది లబ్ధిదారులు మాట్లాడుతూ ఈ వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని అధికారులకు హామీ ఇచ్చారు. ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, హౌసింగ్ ఎఇ సురేష్, పిఆర్ ఎఇ రమణరావు, పంచాయతీ కార్యదర్శి రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

తేరగూడెం అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పేరూరు గ్రామ పంచాయతీ శివారు తేరగూడేనికి రక్షిత మంచినీటి పథకం పైపులైన్ ఏర్పాటుకు, మైక్రో ఫిల్టర్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు రూ.21 లక్షల నిధులను మంజూరు చేసినట్లు దాకారం పిఎసిఎస్ ఛైర్మన్ సోమ సత్యనారాయణ తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సత్యనారాయణ ఆధ్వర్యంలో తేరగూడెం గ్రామస్తులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. కైకలూరులోని ఎంఎల్ఎ స్వగృహంలో శనివారం ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎను కోరారు. దీంతో స్పందించిన ఎంఎల్ఎ తాగునీటి సౌకర్యం కల్పనకు, గ్రామంలోని అన్ని అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు మరో రూ.తొమ్మిది లక్షలు నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు మన



ఎంఎల్ఎ డిఎన్ఆర్‌తో తేరగూడెం గ్రామస్తులు

ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గత నెలలో తేరగూడేనికి వచ్చిన ఎంఎల్ఎను గ్రామస్తులు తాగునీటి సమస్య, రోడ్లు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు తేరగూడేన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎంఎల్ఎ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. త్వరలో తేరగూడెం గ్రామాభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా అడగగానే గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంఎల్ఎకు తేరగూడెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అసౌకర్యం కలిగించొద్దు : కలెక్టర్

లింగపాలెం: నాడు - నేడు పనులకు సంబంధించిన నిర్మాణ సామగ్రిని పాఠశాలల్లో ప్రమాదరహిత ప్రదేశంలో ఉంచాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ధర్మాజిగూడెంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్మాణానికి ఉపయోగించే ఇనుపచువ్వలు ప్రమాదకరమైన రీతిలో పాఠశాల ఆటస్థలంలో ఉంచడంపై పాఠశాల ప్రధానోధ్యాయుడిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ సామగ్రిని ప్రమాదరహిత ప్రదేశంలో ఉంచాలని సమీక్ష సమావేశాల్లో పలుమార్లు సూచించినప్పటికీ, ఆ ఆదేశాలను పాటించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెప్పోత్సవంలో అపశృతి

బాణసంచా పేలి ఎనిమిది మందికి గాయాలు

ముదినేపల్లి :ప్రసిద్ధక్షేత్రమైన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి జరిగిన తెప్పోత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. బాణసంచా పేలి ఎనిమిది మంది గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో ఆలయం వద్ద ఉన్న కోనేరులో స్వామివారు హంస వాహనంపై జలవిహారం చేస్తున్నారు. ఈ సమయంలో పెద్దఎత్తున బాణసంచాను కాల్చారు. పైకి వదిలిన ఓ తారాజువ్వ కిందికి దూసుకొచ్చి గంగానమ్మ గుడివద్ద ఉంచిన మందుగుండు సామగ్రిపై పడింది. దీంతో పెద్దఎత్తున మంటలు చేలరేగాయి. యాత్రికులు భయందోళనతో పరుగులు తీశారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగింది. మందుగుండు సామగ్రి మంటల్లో చిక్కుకుని ఎనిమిది గాయపడ్డారు. వీరిని వివిధ వాహనాల్లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు శ్రమించి మంటలను ఆదుపులోకి తెచ్చారు.

గాయపడిన వారు వీరే

ఈ ప్రమాదంలో ముదినేపల్లికి చెందిన ఓలేటి హేమలత(33), ఓలేటి రఘు(5), సింగరాయపాలేనికి చెందిన కంఠంరాజు నాగశ్రీజ్యోతి(22), కంఠంరాజు సీతామహాలక్ష్మీ (46), చేవూరుపాలేనికి చెందిన సచివాలయ వాలంటీర్ చింతగుంట భానుకృష్ణ (29), వీరమల్లు నాగలక్ష్మీ, కోమర్రుకు చెందిన కె.శివపార్వతీ, మండవల్లి మండలం లింగాలకు చెందిన ఓలేటి వాసవిఉమామహేశ్వరి (56) ఉన్నారు.

క్షతగాత్రులను ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, ఆలయకమిటీ సభ్యులు పరామర్శించారు. క్షతగాత్రులంతా క్షేమంగానే ఉన్నారని ఆలయ ఛైర్మన్ తెలిపారు. అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు.

చంద్రబాబు ద్వారానే రాష్ట్రం అభివృద్ధి : కాపా

చాట్రాయి:టిడిపి అధినేత చంద్రబాబు ద్వారానే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని నూజివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు అన్నారు. చాట్రాయిలోని పార్టీ కార్యాలయంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంపై శనివారం శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన దగ్గర నుంచి మద్యపాన నిషేధం, వృద్ధులకు, వికలాంగులకు రూ.మూడు వేలు పింఛను ఇస్తామని ఇవ్వకుండా కాలయాపన చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇసుక రేట్లు, కరెంటు బిల్లు, మద్యం రేట్లుపెంచి చివరకు చెత్త మీద కూడా పన్ను వేసిన పనికిమాలిన సిఎం జగన్ అని విమర్శించారు.

రవాణారంగ కార్మికులను విస్మరించిన ప్రభుత్వాలు

ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ఏలూరు అర్బన్:ఏటా రూ.మూడు లక్షల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో చెల్లిస్తున్న రవాణా రంగాన్ని, ఆ రంగంలో పనిచేసే కార్మికులను ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని అఖిలభారత రవాణా రంగ కార్మికుల ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరి దేశవ్యాప్తంగా రవాణారంగ కార్మికులకు కూడా సంక్షేమ చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో సిఐటియు నాయకత్వాన, కేరళ రాష్ట్ర ఎంపీలతో పార్లమెంట్‌లో ప్రయివేటు బిల్లు పెట్టేందుకు తమ ఫెడరేషన్ ప్రయత్నిస్తుందని ఆయన తెలిపారు. ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ విధానాలు రవాణారంగంపై ప్రభావం అనే అంశంపై శుక్రవారం ఉదయం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో లక్ష్మయ్య మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలందరికీ నిత్యవసరాలు, మందులు, వైద్య సహాయం, చివరికి చనిపోతే శ్మశానాలకు తీసుకెళ్లే సేవలను నిర్వహించింది రవాణా రంగ కార్మికులేనని ఆయన తెలిపారు. రవాణారంగం ద్వారా పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఏటా రూ.మూడు లక్షల కోట్లు ఆదాయం వస్తోందని ఆయన తెలిపారు. కనీసం దీంట్లో పదో వంతు రవాణా రంగ సంక్షేమ చట్టం కోసం కేటాయిస్తే ఈ రంగంలో పని చేస్తున్న కోట్లాది మంది డ్రైవర్లకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. కానీ డ్రైవర్లు అందరూ మన కళ్లముందు కనపడుతున్న పోలీసు వారిని, ఆర్‌టిఒ అధికారులను మనకు శత్రువుగా చూస్తున్నామని అది సరైనది కాదని, అసలు మనందరికి ప్రధానమైన దోపిడిదారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనని ఆయన తెలిపారు. ఒక్క కేరళ రాష్ట్రంలోనే రవాణా రంగ కార్మికులకు కొంత మెరుగైన సౌకర్యాలున్నాయని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.నాగసూరిబాబు, ఏలూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.అమరకుమార్, గౌడు రవీంద్రబాబు మాట్లాడారు.

పెదనింద్రకొలనులో కుష్టు సర్వే

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని పెదనింద్రకొలనులో జరుగుతున్న కుష్టు వ్యాధి సర్వేను మండల ప్రాథమిక వైద్యశాల అధికారి డాక్టర్ భాగ్యశ్రీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాల గురించి అవగాహన కల్పించారు. స్పర్శ లేకపోవడం, రాగి రంగు మచ్చలు, చేతులు కాళ్లు మొద్దుబారి స్పర్శ తెలియకపోవడం, మచ్చల మీద వెంట్రుకలు రాలిపోవడం, చెవి తమ్మెలు దళసరి ఎక్కడం, కన్ను మూయలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే ఆసుపత్రిలో చూపించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.జగ్గారావు, జె.మరియమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

వికలాంగుల పింఛను రూ.ఆరువేలకు పెంచాలి

ఏలూరు అర్బన్ : వికలాంగులకు రూ.ఆరు వేలు పింఛను ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్ మాదిగ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కో కన్వీనర్ కాశీకృష్ణ మాదిగ, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి మురళీ మాదిగ, ఏలూరు నగర నాయకులు సిహెచ్.బుజ్జి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహనుండాలి

ఆగిరిపల్లి:మహిళల చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం వల్ల చాల సమస్యలను సులభతరంగా పరిష్కరించుకొవచ్చని నూజివీడు రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.సాయిరాం అన్నారు. శనివారం సాయంత్రం ఆగిరిపల్లి ఎంపిపి మెయిన్ స్కూల్లోని భవిత సెంటర్, వెలుగు కార్యాయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళా రక్షణ చట్టాల గురించి, న్యాయస్థానాల ద్వారా మహిళలకు అందజేసే ఉచిత న్యాయ సలహాలు గురించి వివరించారు. అనంతరం భవిత సెంటర్‌లో మానసిక, శారీరక అంగవైకల్యం గల పిల్లలకు చదువును అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.చంటిబాబు, ఎంఇఒ పి.రత్నకుమార్, గ్రామ ప్రముఖులు సిహెచ్.విక్టర్‌బాబు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు శ్రీలక్ష్మీ, రజిని, మహిళలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఎస్ఆర్ నగర్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని ఎస్ఆర్ నగర్ వాసులకు సౌకర్యాలు కల్పనకు అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఇక్కడ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇటీవల ఈ సమస్యలపై ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేసిన వార్త ప్రజాశక్తి పత్రికలో శనివారం ప్రచురితమైంది. ఎస్ఆర్ నగర్‌లో సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఎంపిడిఒను, ఇతర అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు పరీలించి నివేదిక తయారు చేశారు. కృష్ణా పురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 86లో 89.68 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా గత ఎనిమిదేళ్లుగా గిరిజనులు, దళితులు, పేదలు, గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని అయితే ఆ భూమి విషయమై తాడేపల్లిగూడేనికి చెందిన యెగ్గిన నారాయణమూర్తి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపించాలని జెసికి కోర్టు అప్పగించిందని అధికారులు నివేదిక సమర్పించారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈనెల 8,9,10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఎర్రంపేటలో ఉపాధి కూలీలతో కలిసి మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసే సంఘమన్నారు. ప్రజలను మతాల పేరుతో చీల్చే కుట్రలు వ్యతిరేకిస్తూ దాడులకు గురవుతున్న దళితులు గిరిజనులు మహిళలు మైనార్టీలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాలా శ్రీను, కానూరు ఆదినారాయణ, మిద్దె గంగారత్నం, శానం పుష్ప, రాణి, పుష్పాంజలి, భలే దుర్గ, సేన నాగలక్ష్మి, ఎస్.అన్నపూర్ణ పాల్గొన్నారు.